
## కండోమ్‌ల దోపిడి



వాళ్ళు దొంగలైతే కావచ్చు; కానీ వాళ్ళు 'సురక్షిత శృంగార' నియమాన్ని మాత్రం తప్పక పాటిస్తున్నారు. మెక్సికోలో ఇటీవల కొంతమంది దొంగలు ఎయిడ్స్ గురించి అవగాహన కలిగించడానికి, కండోమ్‌లు సరఫరా చేయడానికి వినియోగించే ట్రక్కును దోచుకుపోయారు. ఈ ట్రక్కు 1998 నుండీ తిరుగుతూ ఇప్పటికి 1.2 మిలియన్ కండోమ్‌లు సరఫరా చేసింది. దీన్ని ఒక వీధిలో పార్క్ చేసి ఉండగా దొంగలు ఎత్తుకుపోయారు. పోలీసులు మొదట ఈ ట్రక్కు కోసమే ఈ దొంగతనం జరిగిందనుకున్నారు. అయితే మరుసటి రోజే ఆ ట్రక్కు ఒక షాపింగ్ మాల్ దగ్గర దొరికింది. కానీ అందులో కండోమ్‌లు మాత్రం లేవు. దొంగలు మొత్తం 5,000 కండోమ్‌లు, మైక్ లాంటి పరికరాలు దొంగిలించారు. ట్రక్కు మాత్రం వదిలేయడానికి పోలీసులు ఒక సరదా కారణాన్ని ఊహిస్తున్నారు. ఆ ట్రక్కుపై ఒక పెద్ద బొమ్మ ఉంటుంది. సగం తొక్క ఒలిచిన అరటి పండు, మిగతా సగం కండోమ్ ఆకారాన్ని కలిగిన ఈ బొమ్మ క్రింద 'నేను నన్ను రక్షించుకోగలను, మీరు మిమ్మల్ని రక్షించుకోగలరా?' అన్న కాప్షన్ రాసి ఉంటుంది. బహుశా అదే దొంగల్ని భయపెట్టి ఉంటుందని పోలీసులు జోక్ చేస్తున్నారు.

## తలలో కత్తి



తలలోకి ఐదంగుళాల పొడవైన కత్తి మొన దిగిపోతే బతుకుతారని ఎవరైనా ఊహించగలరా? అందుకే ఆ పదిహేనేళ్ళ లండన్ కుర్రాడు అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాడు. పది నెలల క్రితం అతను స్నేహితులతో ఒక సూపర్ మార్కెట్‌కు వెళ్ళాడు. అక్కడ కొంత మంది దొంగలు జొరబడి కాష్ కౌంటర్‌ని దోచుకోవడానికి ప్రయత్నిస్తే ఈ కుర్రాడు స్నేహితులతో కలిసి వాళ్ళని అడ్డుకున్నాడు. వాళ్ళు ఇతన్ని కొట్టి తలలో కత్తి పొడిచేశారు. ఇలా కత్తి తలలోంచి సగం లోపలికి, సగం బయటికి ఉండగానే స్నేహితులు అతన్ని హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళారు. ఇతని అవస్థ చూసి బతుకుతాడని డాక్టర్లకు కూడా నమ్మకం కుదరలేదు. కానీ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ బతికాడు. కత్తి మొన మెదడును ఏ మాత్రం తాకకుండా ప్రక్క నుండి పోవడంతో అతను బతికాడని, కత్తిని ఏ మాత్రం బయటకు లాగినా మరణించేవాడని చెప్తున్నారు డాక్టర్లు. ప్రస్తుతం బయటకు పొడుచుకు వచ్చిన భాగాన్ని కత్తిరించి వదిలేశారు. ఆ అబ్బాయి ఇప్పుడు ఏ సమస్యా లేకుండా కాలేజీకి కూడా వెళ్తున్నాడట.

## 'సరసి' కత

# బ్యాడ్ డే

వైశంపాయనుడికి ఆ రోజు బాగోలేదు. రాజ పూజ్యం ఒకటి, అవమానం ఆరున్నొకటి అని రాసుంది రాశిఫలాల్లో.

పొద్దున్నే లేచి, పైన ఓవర్ హెడ్ ట్యాంకులోకి నీళ్లెంత వరకూ ఎక్కాయో చూద్దామని డాబా ఎక్కిన అతగాడికి కాస్తంత దూరంలో ఖాళీ స్థలం అవతల మేడ మీద నుంచి చెయ్యి ఊపుతున్న వృకోదరం గారు కనిపించారు. ప్రతిగా, విష్ చేస్తున్నట్టు తను కూడా చెయ్యి వూపేడు వైశంపాయనుడు.

అయితే అదే సమయంలో వృకోదరం గారి భార్య కుముద్వతి తన ఇంటి ముందు కళ్లాపి చల్లుతూ, దూరంగా డాబా మీద నుంచి చెయ్యి ఊపుతున్న వైశంపాయనుణ్ణి చూసింది. తన భర్త మేడ మీద నుంచి చెయ్యి ఊపితే దానికి వైశంపాయనుడు బదులిస్తున్నాడని ఆమెకు తెలియదు. వైశంపాయనుడు తనకే చెయ్యి ఊపుతున్నాడని అపోహ పడిందావిడ.

ఆ నియోజకవర్గం మొత్తానికి తానే సౌందర్యరాశిననీ, కాలనీలో ప్రతి మగాడూ తనంటే పడి చస్తున్నాడనీ చాలా కాలం నుంచి విశ్వసిస్తూ వస్తోందామె. అయితే ఏదో మూగగా ఆరాధిస్తే సంతోషిస్తుందేమో గాని, ఇలా బరి తెగించి వీధిన పడితే ఉపేక్షించే టైపు కాదావిడ.



వెంటనే, విసవిసా పది అంగల్లో వైశంపాయనుడింటికి చేరి అతగాడి నైచ్యాన్ని ఎండగడుతూ దుమ్మెత్తిపోసింది లౌడ్ స్పీకరు సౌండుతో.

నలుగురూ పోగయ్యారు. ''నా కెప్పట్నించో తెలుసు వైశంపాయనుడి గారికి ఇటువంటి పాడు బుద్ధులున్నాయని'' అంటూ పక్కింటి గోకర్ణం గారు ప్రకటించారు. మళ్లీ ఇలాంటి అవకాశం రాదని. ''అవును. ఆ మధ్య నా వైపు కూడా అదోలా చూశాడు గుడి దగ్గర!'' అన్నది దారిన పోతున్న మరొక సుందరి కొంగు కప్పుకుంటూ. ఇంతలో వృకోదరం గారు పరుగెట్టుకొచ్చి, భార్యను లాక్కుపోయాడు. గొడవ సర్దు మణిగింది.

''ఛీ! లేవగానే ఎవరి మొహం చూశానో ఈవేళ.'' అన్నాడు వైశంపాయనుడు లోపలి కొస్తూ. ఇద్దరే ఉన్న కొంప కాబట్టి సుబ్బాయమ్మ గారికి తగిలిందది. ''అద్దం కాదు కదా?'' అందామె గుంభనగా.

*